క్లుప్తంగా

నేడు అమ్మవార్ల జాతర


నడివీధి ముత్యాలమ్మ

మొగల్తూరు: ఉగాది పండుగను పురస్కరించుకుని బుధవారం అమ్మవార్ల జాతరలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా ఉగాది రోజున మొగల్తూరు కుక్కలవారితోటలోని చెట్టుకింద వెలిసిన ముత్యాలమ్మ, మీసేదు వీధిలోని పుంతలో ముసలమ్మ జాతరలను నిర్వహించడం ఆనవాయితీ. ఆసాదుల నృత్యాలు, బాణసంచా కాల్పులతో, తీన్ మార్ డప్పులతో అమ్మవారి జాతరను ఘనంగా నిర్వ హించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు


శ్రీహరిపేటలో కల్వర్ట్ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నరసాపురం: పట్టణంలో వివిధ వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతతో చేయాలని, అదే సందర్భంలో వేగంగా సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ సూచించారు. మంగళవారం పట్టణంలోని 1వ వార్డు శ్రీహరిపేటలో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.13 లక్షలతో చేపట్టిన కల్వర్టు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి నినాదంతో అభివృద్ధికి పెద్దపీటవేసి పనిచేస్తున్నామని చెప్పారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి రోడ్లు, డ్రై యినేజీలు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ సోమరాజు దుర్గాభవానీ, సోమరాజు భరత్ మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సమతుల్యతకు అడవులు దోహదం


కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ శోభారాణి

పాలకొల్లు సెంట్రల్: ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో అడవులు ప్రధాన పాత్ర పోషిస్తాయని ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. మంగళవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ అటవీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ కొంత కాలంగా అడవులు అగ్నికి ఆహుతవుతున్నాయని తద్వారా అరుదైన పక్షి, జంతు, వృక్ష జాతులు నశించిపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శిరీష సంధ్య, రేవతి, హేమలత, నోబుల్ రాజ్ పాల్గొన్నారు.

మనసును కదిలించేదే కవిత

పోడూరు: మనసును కదిలించేదే కవిత అని కవి, ఉపాధ్యాయుడు కొల్లాబత్తుల సూర్యకుమార్ అన్నారు. ఉగాది పండుగ సందర్భంగా గుమ్మలూరు మెయిన్ పాఠశాల హెచ్‌ఎం, కవి అయిన సూర్యకుమార్‌ను సర్పంచ్ గొట్టుముక్కల సోనియారమేష్, గ్రామస్తులు మంగళవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ బొక్కా అనిత, సీఆర్‌పీ మైలే శాంతకుమారి, పెనుగొండ భూలక్ష్మి, కంతేటి నాగమణి, వార్డుమెంబర్లు కొండేటి వెంకటేశ్వరరావు, యల్లమెల్లి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వర ఆలయ పునఃప్రతిష్ఠ

పెనుగొండ: పెనుగొండ ఎస్వీకేపీ కళాశాలల కూడలిలో వినాయకుని ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం గ్రామోత్సవం నిర్వహించి, పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం గురువారం ఉదయం 9.58 గంటలకు ప్రతిష్ఠా మహోత్సవం, సాయంత్రం 5 గంటలకు భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. విగ్రహ ప్రతిష్ఠను కుడిపూడి తరుణ్‌కుమార్, గంగాభవానీ దంపతులు నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పునః ప్రతిష్ఠ మహోత్సవం విజయవంతం చేయాలని కోరారు.

పుస్తక పంపిణీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

పోడూరు: పుస్తక పంపిణీ కేంద్రాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని తనిఖీ అధికారి కేజేఎస్‌ఎల్ కుమారి పిలుపునిచ్చారు. జిన్నూరు శాఖా గ్రంథాలయం పరిధిలోని వేడంగి పుస్తక పంపిణీ కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె బీడీసీ ఏజెంట్లతో మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం పుస్తక పంపిణీ కేంద్రాలకు వచ్చి వివిధ పుస్తకాలను, పత్రికలను చదివేలా ప్రోత్సహించాలని సూచించారు. పుస్తక పంపిణీ కేంద్రాల్లో వివిధ పుస్తకాలు, దినపత్రికలు, వారపత్రికలు అందుబాటులో ఉండాలని చెప్పారు.

చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ


విద్యార్థులకు రాగి జావ అందిస్తున్న వైస్ ఎంపీపీ సుబ్బారావు


జెడ్పీ పాఠశాలలో రాగి జావ పంపిణీ చేసిన జెడ్పీటీసీ గోవర్ధన


కొమ్ముచిక్కాలలో రాగిజావ పంపిణీ చేస్తున్న కవురు శ్రీనివాస్


జీవీఎస్‌వీఆర్‌ఎం పాఠశాలలో రాగిజావ తాగుతున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు


10వ వార్డులో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేస్తున్న దృశ్యం

పోడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీచైర్మన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కవురు శ్రీనివాస్ అన్నారు. కొమ్ముచిక్కాల జెడ్పీహైస్కూల్లో మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు రాగిజావ పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు, వైఎస్సార్‌సీపీ మండల ఇంఛార్జి కలిదిండి గణపతిరాజు, గుంటూరి చంటిరాజు, గ్రామకమిటీ అధ్యక్షుడు నాగరాజు బాలాజీవర్మ పాల్గొన్నారు.

మండలవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ..

మంగళవారం విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తూర్పు పాలెం శివారు ఆనందరావుపేట ప్రాథమిక పాఠశాలలో ప్రజాప్రతినిధులు రాగిజావ పంపిణీ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు గొట్టుముక్కల ఏసురత్నం పాఠశాల విద్యార్థులకు స్టీలు గ్లాసులను బహూకరించారు.

విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించడమే లక్ష్యం

పెనుగొండ: రాష్ట్రంలో ప్రతి విద్యార్థికి ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్యరక్షణ ప్రభుత్వ బాధ్యతగా భావించారని పెనుగొండ మండల జెడ్పీటీసీ పోడూరి గోవర్ధన అన్నారు. మంగళవారం చెరుకువాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న రాగి జావ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆకెశెట్టి చంటి, పెనుగొండ ఎస్వీకేపీ అండ్ కోట్ల వెంకట్రామయ్య పాఠశాలలో సర్పంచ్ నక్కా శ్యా మలా సోనీ, ఇలపర్రులో పెనుగొండ మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, ఎంపీటీసీ పడపట్ల పద్మనాగేశ్వరి, వైసీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, సిద్ధాంతంలో సర్పంచ్ చింతపల్లి గనిరాజు (చంటి), ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు, దేవలో సర్పంచ్ నల్లూరి సత్యనారాయణ, మండల సచివాలయ కన్వీనరు సాకా సుబ్రహ్మణ్యం, సొసైటీ అధ్యక్షుడు గుడాల చినరామకృష్ణ, ములపర్రులో సొసైటీ అధ్యక్షురాలు యాండ్ర మంగాదేవి, యాండ్ర శ్రీను, గుత్తుల రాంబాబు, పితాని వెర్రియ్య, పితాని తిరపయ్య, పితాని పండు, తామరాడలో సర్పంచ్ మాకినీడి కోట సత్యనారాయణ, ఏఎంసీ డైరక్టరు కుసుమే రాంబాబులు, చినమల్లంలో ఏఎంసీ డైరక్టరు గంధ్రేటి అప్పారావు పాల్గొన్నారు.

ఆచంట మండలంలో..

కొడమంచిలిలో మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, పార్టీ నాయకులు, ఆచంటలో సర్పంచ్ కోట సరోజనీ వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు, ఆచంట వేమవరంలో సర్పంచ్ జక్కంశెట్టి చంటి, వీవర్ కార్పొరేషన్ డైరక్టరు అందే నాగ బసవన్న, పెనుమంచిలిలో సర్పంచ్ గణేషు శేషవేణి సుబ్బారావు, ఎంపీడీవో జగన్నాథరావు ప్రారంభించారు.

రాగి జావతో ఆరోగ్యం

నరసాపురం: పట్టణంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా రాగి జావ పంపిణీ చేశారు. ఆయా వార్డుల కౌన్సిర్లు, ఉపాధ్యాయులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. లెనిన్ మున్సిపల్ హైస్కూల్లో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 10వ వార్డులో స్థానిక కౌన్సిలర్ సఖినేటిపల్లి సురేష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు భూసరపు జయ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టీచర్ నాగలక్ష్మి సహకారంతో రూ.40వేలు విలువచేసే పుస్తకాలతో పాఠశాల గ్రంథాలయాన్ని ప్రారంభించారు.

మొగల్తూరు మండలంలో..

మొగల్తూరు: మండలంలోని 17 గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు విద్యార్థులకు రాగిజావను అందించారు. ఐరన్, కాల్షియం, వంటి పోషకాలను అందించి విద్యార్థుల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని అరికట్టేందుకు జగనన్న గోరుముద్దలో పోషకాహారాన్ని అందిస్తున్నారని ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు కోరారు.

జీవీఎస్‌వీఆర్‌ఎం పాఠశాలలో ..

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులు శారీరకం దృఢంగా ఉండాలంటే వ్యాయామంతో పాటు బలమైన ఆహారం చాలా ముఖ్యమైనదని జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాల పీయంసీ చైర్మన్ కొత్తల వెంకటకుమారి అన్నారు. మంగళవారం స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం పాఠశాలలో ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహారంలో భాగంగా విద్యార్థులకు రాగి జావ అందజేశారు. ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్, ఉపాధ్యాయులు శశికళ, త్రిమూర్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం కోసం రాగిజావ

నరసాపురం రూరల్: విద్యార్థుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం రాగిజావ అందిస్తోందని ఏపీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న అన్నారు. మంగళవారం మండలంలోని సీతారాంపురం సౌత్ పంచాయతీలోని వెంకట్రావుతోట ప్రాథమిక పాఠశాలలో ఆయన సర్పంచ్ వెంకట్‌తో కలిసి విద్యార్థులకు రాగిజావ పంపిణీని ప్రారంభించారు. యర్రంశెట్టివారిపాలెంలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు.

ఆగర్తిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

పాలకొల్లు అర్బన్: ఆగర్తిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు రాగి జావ అందించే కార్యక్రమాన్ని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పడవల సునీల్‌బాబు ప్రారంభించారు. దిగమర్రులో సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్ దిగమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు.

మార్టేరు పాఠశాలల్లో..

పెనుమంట్ర: మార్టేరు బాసంతిదేవి జెడ్పీ పాఠశాల, ఎస్ ఇల్లిందలపర్రు యూపీ పాఠశాలలో మంగళవారం జాగిజావ పంపిణీ చేశారు. పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి, ఎంపీపీ కర్రివాసురెడ్డి పాల్గొన్నారు.

బాలబాలికలకు పోషకాహారం అందించాలి


మొగల్తూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

మొగల్తూరు: కిషోర్ బాలబాలికలకు గర్భిణులకు పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సీడీపీవో ఊర్మిల కోరారు. పోషణ్ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం మొగల్తూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం రోజులపాటు పోషకాహార పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పోషకాహార పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వారం రోజుల పాటు పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు, శిశువులకు పోషకాహారం అందించేలా కృషి చేయాలని అంగన్‌వాడీల ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్‌సీ ఆనంద్ కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు


కోర్టు భవనం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నరసాపురం: నరసాపురం కోర్టులో మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. విజయవాడ భవానీపురంలో భగవాన్‌దాస్ అనే న్యాయవాది విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరు అభ్యంతరకరంగా ఉందని నిరసిస్తూ విధులు బహిష్కరించి కోర్టు భవనం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కామన బుజ్జి, పోలిశెట్టి యర్రంశెట్టి ఫణికర్ మాట్లాడుతూ ఈనెల 15న భగవాన్‌దాస్ తన 10 ఏళ్ల వయస్సుగల కూతురు పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తించిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా, ప్రత్యర్థులు పెట్టిన కేసుపై ఎలాంటి విచారణ లేకుండా కేసు నమోదు చేశారని అన్నారు. నిబంధనలు పాటించకుండా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోడి సత్యనారాయణ, పోలిశెట్టి బాబ్జి, చల్లా దానయ్యనాయుడు, పోలిశెట్టి శ్రీరఘురామారావు, నల్లిమల్లి జోసఫ్, పోలిశెట్టి సూరిబాబు, పూరిళ్ల శ్రీనివాస్, సోడదాసి శ్రీధర్, బొలిశెట్టి నవీన్ పాల్గొన్నారు.

నేటి నుంచి ముఖదారమ్మ జాతర మహోత్సవాలు


అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవ ఏర్పాట్లు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావి చెరువుగట్టున కొలువై ఉన్న ముఖధారమ్మ జాతర మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వైభవంగా విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాలు ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకూ వారం రోజులు పాటు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు, రాత్రి 7 గంటలకు పిన్ని ఉప్పరి పుట్టింటివారి ఆధ్వర్యంలో జాతర ఉత్సవం, గురువారం అమ్మవార్లకు చలివిడి, పానకం సమర్పణ, రాత్రి అమ్మవారికి కంభం, జాతర ఉత్సవం, శుక్రవారం కాకుల కుటుంబ సభ్యులతో రాత్రి అమ్మవారికి కుంభం సమర్పణ, అనంతరం జాతర మహోత్సవం నిర్వహించనున్నారు. కమిటీ అధ్యక్షుడు మండెల రజనీ, సెక్రటరీ కుంపట్ల చిన్నరాజా, ట్రెజరర్ చెక్కా కృష్ణ, కమిటీ సభ్యులు ఉత్సవ ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు ఉగాది ప్రవచనం

పాలకొల్లు సెంట్రల్: తిరుమలతిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మన గుడి కార్యక్రమంలో భాగంగా ఉగాది, శ్రీరామనవమి శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు ఆచారి మంగళవారం తెలిపారు. బుధవారం ఉగాది పర్వదినం సందర్భంగా సాయంత్రం 6.30 గంటలకు గుత్తిన నరసింహమూర్తితో ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు తెలిపారు. 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ ప్రతి రోజు ఆలయంలో డాక్టర్ గొర్తి వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రితో ప్రవచన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

జీవకోటికి ప్రాణాధారం జలం

పాలకొల్లు సెంట్రల్: సమస్త జీవకోటికి ప్రాణాధారం నీరేనని, జలం లేనిదే జీవం లేదని రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రంగారావు తెలిపారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి అధ్యక్షతన ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు జి శ్రీనివాసరావు, జగపతి బాబు పూజిత, విజయ్ కుమార్, ఎం రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట కాలువలో మృతదేహం లభ్యం

పాలకొల్లు అర్బన్: నరసాపురం - నిడదవోలు ప్రధాన పంట కాలువలో కొత్తపేట పంచాయతీ పరిధిలోని గుబాలగుంట వద్ద మంగళవారం గుర్తు తెలియని పురుషుని మృతదేహాన్ని గుర్తించినట్లు రూరల్ ఎస్సై కె శ్రీనివాస్ తెలిపారు. మృతదేహంపై దుస్తులు లేవన్నారు. వయస్సు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందన్నారు. మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

పెనుగొండ: నానాటికీ పెరుగుతున్న గుండెపోటు మరణాలపై ముందస్తు జాగ్రత్తలు, ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో మంగళవారం ఆచంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 108 సిబ్బంది అవగాహన సదస్సు నిర్వహించారు. గుండె పోటు వచ్చిన వ్యక్తులకు ముందుగా అందించాల్సిన ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ వి క్రాంతి కిరణ్, జీ సురేష్, టి రాంబాబు, 108 సూపర్‌వైజరు డి రాజు, ప్రధానోపాధ్యాయుడు శేఖర్ బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

పెనుగొండ: పోషకాహారం అందించడం ద్వారా చిన్నారులు, కిషోర్ బాలికలు, గర్భిణులు ఆరోగ్య దారుఢ్యాన్ని కాపాడవచ్చునని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ అన్నారు. పెనుగొండ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం ఐసీడీఎస్, వైద్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆహారంలో చిరుధాన్యాలు చేర్చడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు ఎం విజయకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎస్ ఇల్లిందలపర్రులో దానమ్మతల్లి ఉత్సవాలు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలం ఎస్ ఇల్లిందలపర్రులో దానమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారం నుంచి మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. గ్రామ శివారున ఉన్న అమ్మవార్లను సంక్రాంతి రోజున గ్రామంలోని పూరిగుడిసెకు తీసుకువచ్చి, ఉగాది రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆలయానికి తీసుకెళతారు. ఉదయం గ్రామదేవతలైన దానమ్మ, గోగులమ్మ, కనకదుర్గమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం గ్రామంలోని పూరిగుడిసె నుంచి గోగులమ్మ, కనకదుర్గమ్మ, ఆలయం నుంచి దానమ్మ ఆలయం వరకు చిరుబండి ఉత్సవం నిర్వహిస్తారు. మార్గమధ్యలో అమ్మవార్లకు ఊయల సేవ నిర్వహిస్తారు.

నేడు పెద్దింట్లమ్మ ఆలయంలో ఉగాది ఉత్సవాలు

పెనుగొండ: పెనుగొండ మల్లప్పదిబ్బలోని ప్రసిద్ధి గాంచిన పెద్దింట్లమ్మవారి తీర్థ మహోత్సవాలు ఉగాది రోజున బుధవారం నుంచి 26వ తేదీ వరకూ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ గుడాల లక్ష్మీ దుర్గారావు మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం ఉగాది తీర్థ మహోత్సవ పూజలు, కుంకుమార్చనలు, 23వ తేదీనుంచి 26వ తేదీ వరకూ అమ్మవారికి నిత్యార్చనలు, కుంకుమ పూజలు, నిత్య లలితా పారాయణ, భజనా కాలక్షేపం నిర్వహిస్తామన్నారు. 26వ తేదీ ఉదయం 11 గంటలకు భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీ ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకోవాలి

మొగల్తూరు : అసెంబ్లీ సాక్షిగా అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలపై దాడులకు పాల్పడిన సభ్యులపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ కొల్లాబత్తుల రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దళితుల మధ్య చిచ్చుపెట్టేందుకు చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారని, అందుకు ఉదాహరణ దళిత ఎమ్మెల్యేపై దాడికి ప్రయత్నించడమేనన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దళితులను ఉన్నత స్థానంలో కూర్చోబెట్టి సముచిత స్థానం కల్పిస్తున్నారని, దానిని చూసి ఓర్వలేక చంద్రబాబు దళితులపై దాడికి ఆపార్టీ ఎమ్మెల్యేలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. శాసనమండలి చైర్మన్‌గా దళిత నాయకుడిని నియమించారని, మరికొందరికి మంత్రి మండలిలో సముచితస్థానం కల్పించారని అన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు దళితులకు ఏస్థానం కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా టీడీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో హుందాగా వ్యహరించి తమ గౌరవాన్ని కాపాడుకోవాలని హితవు పలికారు. సమావేశంలో ఎస్సీ సెల్ నాయకులు పడవల సత్యనారాయణ, కొల్లాబత్తుల రాంపండు, కోడెళ్ళ వెంకట్రావు, వర్దనపు విజయ్ కుమార్, పాకెర్ల అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మాతాజీ నిర్మలా దేవి జయంత్యుత్సవం

పెనుగొండ: సహజ యోగ ప్రధాత మాతాజీ నిర్మలాదేవి 100వ శత జయంతిని ఆచంటలోని భవ్యభారతిలో మంగళవారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహజ యోగ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కొడమంచిలిలోని చిలుకూరి భూలక్ష్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, పెనుగొండలోని యోగా మందిరంలో సహజ యోగా పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సహజయోగి కొలిశెట్టి వీర వెంకట తాతారావు, ఉపాధ్యాయులు, సహజయోగి పాల్గొన్నారు.